క్లుప్తంగా

కాలభైరవస్వామికి అభిషేకాలు



స్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్ : బలగ నాగావళి తీరంలో బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. అనంతరం గోపూజ, నిత్యాన్నదానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న సాధకులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పెద్దపాడు వద్ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ హేపీనెస్ సెంటర్‌లో ఆదివారం ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు. యోగా టీచర్లు కింజరాపు అమ్మన్నాయుడు, దేసూళ సురేంద్ర ఆధ్వర్యంలో 50 మంది సాధకులు పాల్గొని సుదర్శన క్రియ, వ్యాయామం, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి 17 వరకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు జరుగుతాయని, పాల్గొనదలచిన వారు 7989752675 నంబరును సంప్రదించాలని కోరారు.

మురపాక మండల సాధనకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాక గ్రామ పంచాయతీని ఇతర పరిసర గ్రామ పంచాయతీలతో కలిపి మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మురపాక, పరిసర పంచాయతీల కూటమి నాయకులు ఆదివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, మాజీ జెడ్పీటీసీ రాజాపంతుల ప్రకాశరావు, నాయకులు పాల్గొన్నారు.

యువ రచయిత్రికి సత్కారం



అమ్మోజీని సత్కరిస్తున్న సాహితీవేత్తలు

రణస్థలం : సాహిత్యం, సేవా కార్యక్రమాల్లో రాణిస్తున్న సచివాలయ మహిళా పోలీస్ అమ్మోజీని ఆదివారం విశాఖపట్నంలో ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, విశ్వభారత్ డైరెక్టర్ బలివాడ రమేష్, శ్రీనాధుని వంశస్తుల చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అమ్మోజీ రచనలు సామాజిక సందేశాలతో, నైతిక విలువలను స్పృశించేలా ఉంటాయని చెప్పారు. అనంతరం అమ్మోజీ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సంస్థలో సముచిత స్థానం కల్పించి ప్రోత్సహించిన చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యులు ఈశ్వరి భూషణం, చిట్టి లలిత, పార్థసారథి, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

భూముల కేటాయింపు

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడ పరిధిలోని సంచాం గ్రామంలో 22.45 ఎకరాల భూమిని వీఎస్‌ఆర్ సర్కాన్ పరిశ్రమకు ఏపీఐఐసీ ద్వారా కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏపీసీ లైట్ బ్రిక్ యూనిట్ ఏర్పాటులో భాగంగా ఎకరా రూ.11.62 లక్షలకు కంపెనీ కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

ఇదేం తీరు?

- రద్దీ రోడ్లలో పగటి పూట పనులు
- అస్తవ్యస్తంగా పలకల నిర్వహణ
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని ట్రాఫిక్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు



పట్టపగలు నిర్మాణ పనులు చేయడంతో నిలిచిన ట్రాఫిక్



సరస్వతి మహల్ కూడలి వద్ద రోడ్డుపైనే నిర్మాణ పలకలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు వాహనాల సంఖ్య కూడా పెరిగిపోతుండటం, రోడ్లు వెడల్పు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం నగరంలో సరస్వతి మహల్ వద్ద మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. ఇక్కడ కాలువపై పలకలు వేయడం, కాలువలు శుభ్రం చేయడం వంటి పనులు చేయడం మంచిదే అయినప్పటికి పట్టపగలు చేయడం ఇబ్బందికరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో రాత్రివేళల్లో పనులు చేస్తే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. మున్సిపల్ ఇంజనీర్లు, కాంట్రాక్టులు అవగాహన లోపంతో పగటిపూట పనులు చేయడం వల్ల గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయాల్లో ఎంతోమంది బ్యాగులతో పడిపోతున్నారు.

ప్రమాదకరంగా పలకలు..

ఈ మలుపు వద్ద ఇబ్బందితో అటు రామలక్ష్మణ కూడలి, ఇటు రైతుబజారు కూడలిలో తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. కాలువపై వేసేందుకు తెచ్చిన పలకలు నడిరోడ్డుపై వేసేశారు. ఖాళీగా ఉన్న ప్రాంతంలొ పలకలు పోసుకుని పని చేయాల్సిన చోటకు తీసుకురావాల్సి ఉండగా రవాణాకు అదనంగా ఖర్చయిపోతోందని రోడ్డుపైనే వేసేశారు. దీంతో గత పది రోజులుగా ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. సాయంత్రం కాలేజీలు, స్కూల్లు విడిచిపెట్టిన సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. బాకర్‌సాహెబ్‌పేట, జి.టి రోడ్డులకి ఆనుకుని ఉన్న పలు వీధుల్లోనూ నడిరోడ్డుపై పలకలు అస్తవ్యస్తంగా ఉండటంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు, మున్సిపల్ ఇంజనీర్లకు చెప్పుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ప్రధాన రహదారుల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



బాకర్‌సాహెబ్‌పేటలో ప్రమాదకరంగా ఉన్న కాలువ పలక



జి.టి.రోడ్డు నుంచి జేసీ బంగ్లాకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న పలకలు

ప్రమాదకర ప్రయాణం..



నగరంలో చాలా ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలతో వెళ్లేటప్పుడు ఎక్కడ ఏ ప్రమాదానికి గురవుతామేమోనని భయమేస్తోంది. పది రోజులుగా సరస్వతి మహల్ రోడ్డువైపు వెళ్లలేకపోతున్నాం. పట్టపగలు పనులు చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– వై.రాజారావు, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం..



ప్రధాన రహదారుల్లో పనులను వీలైనంత వరకు రాత్రి వేళల్లో చేపట్టేలా చూస్తాం. నిర్మాణాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఇప్పటి వరకు ఈ విషయం మా దృష్టికి రాలేదు. నగరంలో అన్ని ప్రాంతాల్లో పలకలు సరిచేసి ప్రమాదాలకు అవకాశం లేకుండా చేస్తాం

– పి.వి.వి.డి ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పైడి సింధూర

శ్రీకాకుళం అర్బన్: నిస్వార్థ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులకు, సభ్యులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు విశ్రాంత డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శ్రీకాకుళంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. నూతన అధ్యక్షురాలిగా ప్రముఖ వైద్యురాలు లయన్ పైడి సింధూర బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా టెక్కం రామ్ గోపాల్, కోశాధికారిగా బరాటం కృష్ణ చైతన్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బి.ఉమామహేశ్వరరావు, ఉర్లాం శివతేజ, క్లబ్ ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా ఎన్.రమ్య, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా ఎంకే మిశ్రో, క్లబ్ మార్కెటింగ్ కమ్యూనికేషన్ చైర్‌పర్సన్‌గా పొడుగు చరణ్, మెడికల్ డైరెక్టర్‌గా డాక్టర్ బగాది జగన్నాథరావు, ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ బాడాన దేవభూషణరావు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఐ.అనిల్, డైరెక్టర్లుగా పి.సింహాచలం, బరాటం మాధురీలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నటుకుల మోహన్, పొన్నాడ రవి కుమార్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతల నిర్వహణలో భాగంగా కలిసికట్టుగా ముందుకువెళ్తామన్నారు. క్లబ్ నూతన అధ్యక్షురాలు పైడి సింధూర మాట్లాడుతూ సమాజానికి అవసరమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని, ముఖ్యంగా యువతను చైతన్యపరుస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వపు గవర్నర్ డీఎస్ఎస్‌వీ. వర్మ, ప్రస్తుత గవర్నర్ కె.వి.సుబ్బరాజు, నున్న శ్రీనివాసరావు, పప్పల జగన్నాథరావు, కొంక్యాణ వేణుగోపాల్, పి.జగన్మోహనరావు, పూడి తిరుపతి రావు, మొదలవలస రమేష్, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి నూతన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి అనతికాలంలోనే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. లయన్ వావిలపల్లి జగన్నాథనాయుడు అధ్యక్షతన హర్షవల్లి లైన్స్ క్లబ్ 2025 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ క్లబ్ సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్, కార్యదర్శిగా లక్ష్మణ్, ట్రెజరర్ పార్వతీశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తర్లాడ అప్పలనాయుడు, పాలిశెట్టి మధుబాబు, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా గుడ్ల గౌతమ్, మార్కెటింగ్ – కమ్యూనికేషన్స్ చైర్‌పర్సన్ మజ్జి సుమన్, క్లబ్ డైరెక్టర్ మణిశర్మ, క్లబ్ ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్ ఎ.వెంకునాయుడు, మెంబర్‌షిప్ చైర్మన్ చందక నీహార్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్, ఎక్స్‌టెన్సన్ చైర్‌పర్సన్‌గా హారిక ప్రసాద్, క్లబ్ పార్ట్‌క్స్ ఎడాప్సన్ చైర్‌పర్సన్‌గా కరణం శోభారాణి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీఓ ప్రత్యూష, రీజినల్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ కనుగుల సుధీర్, ఐఎంఏ అధ్యక్షుడు నరసింహమూర్తి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణబాబు, ఏపీఈపీడీసీఎల్ జీఎం సలాది సుబ్బారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనల ఆలాపన



కీర్తనలు ఆలపిస్తున్న ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో స్వరాత్మిక సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనల ఆలాపన ఆదివారం ఆకట్టుకుంది. పీఠం వ్యవస్థాపకులు కె.వి.ఉమామహేశ్వరరావు ' శ్రీవెంకట రాజీవాక్ష మేలుకొనవే' సంకీర్తనతో ప్రారంభమై 'వెదకినదియే వేదార్థము సరిలేరు అతనికి సాహస విక్రమ' కీర్తనతో ముగిసింది. కీబోర్డుపై మాస్టర్ శ్రీనివాస్, తబలాపై వి.సూర్యనారాయణ వాద్య సహకారం అందించారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



విద్యార్థులతో మాట్లాడుతున్న దేవాంగ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని సంఘ అధ్యక్ష కార్యదర్శులు గుంటముక్కల వీరభద్రరావు, కాశిన సూర్యప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాదుర్లపేట, ఫాజుల్‌బాగ్‌పేట దేవాంగులవీధిలో ఆదివారం 1 నుంచి 10వ తరగతి చదువుతున్న దేవాంగ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కొణపల ప్రసాదరావు, గుత్తు చిన్నారావు, తూతిక గణపతిరావు, నక్కిన శాంతారావు, చప్పటి లక్ష్మణరావు, గుత్తు మురళి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరనారీమణులకు సత్కారం



సత్కారం అందుకుంటున్న శ్రీకాకుళం వీరనారిమణులు, వీరమాతలు

శ్రీకాకుళం కల్చరల్: కార్గిల్ విజయ దివస్ స్మారకోత్సవం పురస్కరించుకొని విశాఖలో కార్యేషు ఈవెంట్స్ అనే మహిళా సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరానికి చెందిన వీరమాత, వీరనారీమణులను ఘనంగా సత్కరించారు. ఆపరేషన్ సింధూర్ అనంతరం వీరమాతలకు, వీర నారీమణులకు 'మా క్షేమం–మీ త్యాగం–మా ధైర్యం' అనే నినాదంతో శ్రావణ సఖి–4వ ఎడిషన్‌లో భాగంగా ఈ కార్యకర్మం నిర్వహించారు. వివిధ ఆపరేషన్‌లలో అమరులైన 25మంది వీర సైనికుల తల్లులను, భార్యలను, దేశ సేవ చేస్తూ ప్రాణాలు కోల్పొయిన సైనికుల భార్యలను రూ.10వేలు నగదు, చీర, మెమెంటోలతో సత్కరించినట్లు జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం ఆదివారం తెలిపారు.

ఇదేనా 'చెత్త'శుద్ధి?

- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- కంపుకొడుతున్న నగరం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మున్సిపల్ కార్యాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త



కళింగరోడ్డులో డంపర్ బిన్ వద్ద చెత్తాచెదారాలు తింటున్న ఆవు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగంలో చిత్తశుద్ధి లేకపోవడంతో నగరంలో చెత్తశుద్ధి కరువైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం క్లాప్ వెహికల్స్‌తో ప్రతి రోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రమంగా జరిగేది. ఎక్కడా డంపర్ బిన్‌లో రోజుల తరబడి చెత్త దర్శనమిచ్చిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి అధ్వానంగా మారింది. చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. దీనికి తోడు పారిశుద్ధ్య కార్మికులు ఈ ఏడాది కాలంలో పలుమార్లు సమ్మెబాట పట్టారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలం కావడంతో పేరుకుపోయిన చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.

పేరుకే ప్లాస్టిక్ నిషేధం..

చెత్తను ఎప్పటికప్పుడు తీసుకెళ్లాలని నగరవాసులు కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. క్లాప్ వెహికల్స్, డంపర్‌బిన్లు లిఫ్టీచేసే వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడం వల్లే నగరవాసులకు చెత్త సమస్య తీరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయంకి కూత వేటు దూరంలోనే డంపర్‌బిన్ నిండిపోయి ఆవులు చేరి చిందరవందరగా చేస్తుండటం గమనార్హం. మరోవైపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధమని ఊకదంపుడు ప్రచారాలే తప్ప ఆచరణలో ఎక్కడా అమలుకావడం లేదు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం డంపర్ బిన్‌ల చుట్టూ ఉన్న కవర్లే. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చొరవ చూపి చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని నగరవాసులు కోరుతున్నారు.

కూటమి పాలనలో మత్స్యకారులకు అన్యాయం



ఎన్.జి.ఆర్.పురంలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం : కూటమి ప్రభుత్వ పాలనలో మత్స్యకారులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందక, అభివృద్ధి పనులు జరగక బతుకులన్నీ కుదేలైపోయాయని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం మండలం మరువాడ, ఎన్.జీ.ఆర్. పురం గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను తెలియజేశారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో అందించిన సంక్షేమాన్ని మరోసారి గుర్తు చేశారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వంలో ఎంతో అన్యాయం జరిగిందని చెప్పారు. మత్స్యకార భరోసా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు టేకు బ్రహ్మాజీ, సర్పంచ్‌లు గొర్లె రాధాకృష్ణ, జక్కంపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్న, నాయకులు పిల్ల తాత, అల్లిపల్లి అప్పన్న, దన్నాన సీతారాం, జిగిలి అప్పల నర్సయ్య, కొండబాబు, అప్పన్న, జక్కంపూడి గురువులు, కోటి, పాలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోసకారి బాబుకు బుద్ధిచెప్పాలి



తాళ్లవలసలో ప్రభుత్వ వైఫల్యాలను నిర్వహిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల : సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జాప్యం చేస్తున్నారని, కూటమి నాయకుల మోసాలకు తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు అన్నారు. లావేరు మండలం తాళ్లవలసలో ఆదివారం బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో నయవంచన



సింగుపురంలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: కూటమి పాలనలో ప్రజలకు మోసాలే మిగిలాయి తప్ప ఇచ్చిన ఏ ఒక్క హామినీ కూడా నెరవేర్చలేదని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని సింగుపురం, లంకాం గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేతకాని మాటలు ఆడటం సబబు కాదన్నారు. కూటమి నాయకులు బూటకపు హామీలతో ప్రజలను మోసగించారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, బాణ నర్సింగరావు, గొండు కృష్ణ, చిట్టి రవికుమార్, ఉంగటి గోపాలరావు, బగ్గు అప్పారావు, పెద్దిన హరి, కంచు వసంతరావు, ఎచ్చెర్ల శ్రీధర్, గుండ హరేష్, రుప్ప అప్పలసూరి, కుంచాల సురేష్, బగాది మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం మూరెడు..అప్పులు బారెడు..



శ్రీకాకుళం నగరంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పులు లక్షలు కోట్లు రూపాయలు దాటుతున్నా ప్రజలకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలుచేయకుండా మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ దుయ్యబట్టారు. శ్రీకాకుళం నగరంలోని 22వ డివిజన్ పొడుగు నారాణమ్మకాలనీ, కోర్టు వెనుక, చిన్న బొందిలీపురం ప్రాంతాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు వితంతు పెన్షన్ మంజూరు కావడం లేదని మొరపెట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మరణించిన నెల రోజుల్లో వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ పెన్షన్ అందించేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా కొత్త పెన్షన్ల ఊసే లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు సాదు వైకుంఠరావు, పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణారావు, అల్లు లక్ష్మీనారాయణ, కింజరాపు రమేష్, యండ రమేష్, బైరి మురళీ, సీపాన మహేంద్ర, హరి, జె.శ్రీనివాస్, శాంతారావు, చందు, వానపల్లి రమేష్, కన్నబాబు, రౌతు శంకరరావు, సీర సత్యనారాయణ, భాను ప్రసాద్, వార్డు పెద్దలు, పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

5న విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు సంస్థలు ఇచ్చిన పిలుపుమేరకు ఆగస్టు 5న విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడే అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దక్షిణాదిలో కేరళ, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయని గుర్తు చేశారు.

ఇది మీటర్ మార్పు మాత్రమే కాదని, విధానం మార్చే కుట్ర అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలియజేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.షణ్ముఖరావు, సీహెచ్.అమ్మన్నాయుడు, ఎస్.ప్రసాదరావు, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.